సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 22.58 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 22.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 282 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61 వేలు
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,495
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,660
నవర (8 గ్రాములు)	రూ.45,280

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /25.7

గాలిలో తేమ 74 శాతంగా ఉంది. జిల్లాలో ఆదివారం ఉదయం ఉక్కపోత వాతావరణం, మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గణేశ్ లడ్డూ @ రూ.1.90 లక్షలు



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వేదాయపాళెం సెంటర్‌లో గణనాథుడికి నివేదించిన లడ్డూ ప్రసాదాన్ని రూ.1.90 లక్షలకు దక్కించుకున్నారు. నిమజ్జనానికి ముందు లడ్డూ ప్రసాదానికి వేలాన్ని నిర్వహించగా, హలో ప్రాపర్టీస్ డైరెక్టర్లు అఫ్రోజ్, సుధాకర్, సుబ్బారావు, మణి, రవి, తన్నీరు మాధవరావు, రాజేష్, సురేష్, ఫిరోజ్, శ్రీధర్ ఈ మొత్తానికి దక్కించుకున్నారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా 5కే రన్



నెల్లూరు(బారకాసు): ఎయిడ్స్, తదితర వ్యాధులపై అవగాహన నిమిత్తం 5కే రన్‌ను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమాన్ని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ప్రారంభించారు. ఏసీ స్టేడియం నుంచి వేదాయపాళెంలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు.. తిరిగి స్టేడియం వరకు రన్ ఉత్సాహంగా సాగింది. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏడీఎం హెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి బొజ్జ గణపయ్య



గంగాహారతిని నిర్వహిస్తున్న వేదపండితులు



క్రేన్ సాయంతో గణనాథుడి విగ్రహ నిమజ్జనం

- భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు
- సింహపురిలో ఆధ్యాత్మిక శోభ

నెల్లూరు (బృందావనం): వినాయక చవితిని పురస్కరించుకొని వాడవాడలా ప్రతిష్ఠించిన గణనాథుల విగ్రహాల నిమజ్జనాన్ని సింహపురిలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని పెన్నా బ్యారేజీ, మూలాపేటలోని గణేశ్ ఘాట్ వద్ద నిమజ్జనానికి భారీ గణనాథుల విగ్రహాలు తరలివచ్చాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలు, గంగా హారతులు, పండరి భజనలు, కోలాటాలు, బాణసంచా వెలుగులు, విద్యుద్దీపకాంతులు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వర్ణాల చెరువు వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను గన్నవరంలోని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి నిర్వహించారు. భక్తులపై పవిత్ర గంగా జలాన్ని కాశీకి చెందిన వేదపండితులు ప్రోక్షణ చేశారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

అనుగ్రహభాషణ

విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమలానందభారతి అనుగ్రహభాషణ చేశారు. నెల్లూరులోని స్వర్ణాల చెరువుకు 1100కు పైగా ఏళ్ల చరిత్ర ఉందని చెప్పారు. మేయర్ స్రవంతి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేటర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్, ఉత్సవ సమితి ముఖ్య సమన్వయకర్త సురేంద్రరెడ్డి నిర్వాహకులు సత్యనాగేశ్వరరావు, ఉమామహేష్, బయ్యా వాసు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మకు పూజ చేస్తున్న కమలానందభారతి



నిమజ్జనానికి పయనమైన భారీ గణనాథుడు



నిమజ్జన కార్యక్రమాలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, కమిషనర్ తదితరులు



గణేశ్ ఘాట్ వద్ద మహిళల కోలాట ప్రదర్శన

చేతివృత్తిదారులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి చేతివృత్తిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. చేతివృత్తిదారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి వారి ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. నైపుణ్య శిక్షణతో పాటు ఉపకరణాలకు రూ.15 వేలను అందజేయనుందని వెల్లడించారు. ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు తొలి విడతగా రూ.లక్ష రుణాన్ని అందజేయనున్నారని పేర్కొన్నారు. డీఆర్డీఏ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, కార్మిక తదితర శాఖల అధికారులను భాగస్వాములను చేసి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. బ్యాంకర్లు, పరిశ్రమల శాఖ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి రుణాలపై చేతివృత్తిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ జేడీ సుధాకర్, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ రాజశేఖర్, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి చందర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

- సోమిరెడ్డిపై ధ్వజమెత్తిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఈద్గాలో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ఎవరెన్ని కుయుక్తులు పన్నినా సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకోలేరని.. తనను ఎదుర్కోలేక నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శతవిధాలా యత్నిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పేదలకు ఇంటి నివేశన స్థలాలను పంపిణీ చేస్తే.. న్యాయస్థానాల ద్వారా వాటిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పట్టణంలోని ఈద్గాలో దాదాపు రూ.26 లక్షలతో నిర్మించతలపెట్టిన ప్రహరీకి శనివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదల పొట్టకొట్టాలని చూస్తే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొని పేదల అభ్యున్నతికి కృషి చేస్తానని వెల్లడించారు. తాను సొంతవాడ్ని కావడంతో ముస్లింల సమస్యలను గుర్తించి ఈద్గాకు ప్రహరీ నిర్మాణానికి రెండు వారాల్లో నిధులను మంజూరు చేయించానని తెలిపారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచే తమ కుటుంబాన్ని నమ్ముకొని ముస్లింలు ఉన్నారంటూ పేరుపేరును మంత్రి వెల్లడించారు. ముస్లింల అభ్యున్నతికి కృషి చేయడం తన బాధ్యతని చెప్పారు. మతపెద్దల సలహాలు, సూచనలతో ముందుకెళ్తానన్నారు. ముస్లింలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే నడిచి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామాలకు దారులు తెలియని వారొచ్చి అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈద్గాలో మిగిలిన అభివృద్ధి పనులకూ నిధులను మంజూరు చేయించనున్నామని పేర్కొన్నారు. తొలుత మంత్రికి ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమ అరుణ, వక్ఫ్‌బోర్డు జిల్లా జాయింట్ సెక్రటరీ ఖాదర్, మైనార్టీ నేత అంజద్, ఎంపీటీసీలు షాకీరాబేగం, లక్ష్మీకల్యాణి, శ్రీనివాసులు, కో ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, పార్టీ నేత పెదమల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి



మాట్లాడుతున్న పరిశీలకులు

మనుబోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమాట్) రాష్ట్ర పరిశీలకులు శారదాకుమారి, అపర్ణ పేర్కొన్నారు. మండలంలోని గొట్లపాళెం ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా శనివారం వారు తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారాన్ని అందజేస్తున్నారాననే అంశాన్ని ఆరాతీశారు. వీరు క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చేలా చూడాలని కోరారు. లెసన్ ప్లాన్‌ను తప్పక అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ సుధీర్‌బాబు, సీఆర్‌ఎం చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లులను యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారంతో పాటు మిలాద్ - ఉన్ - నబీ పర్వదినం 28న జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక రేపు

నెల్లూరు(దర్గామిట్ట): సీ రాఘవాచారి మీడియా అకాడమీ (ప్రెస్ అకాడమీ) చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు నెల్లూరులోని ఆర్ అండ్ బీ అతిథిగృహానికి సోమవారం రానున్నారు. టౌన్‌హాల్లో సింహపురి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంగళవారం ఉదయం ఎనిమిదికి ఒంగోలుకు పయనమవనున్నారు.

ఉత్కంఠభరితంగా ఫుట్‌బాల్ పోటీలు


తలపడుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు


మలిరెడ్డిని సత్కరిస్తున్న క్రీడాకారులు

• నేడు ఫైనల్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. రెండో రోజైన శనివారం అపోలో హాస్పిటల్ సీఈఓ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ రంజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. తొలి క్వార్టర్ ఫైనల్స్‌లో ఏలూరు జట్టు బాపట్ల జట్టుపై 2–0, కాకినాడ జట్టు తూర్పు గోదావరి జట్టుపై 1–0, సత్యసాయి జట్టు పెనాల్టీ షూట్‌అవుట్‌లో 5–4, విశాఖ జట్టు విజయనగరం జట్టుపై 4–0 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో ఏలూరు జట్టు బాపట్ల జట్టుపై 2–0, కాకినాడ జట్టు తూర్పు గోదావరి జట్టుపై 1–0, సత్యసాయిజట్టు ఎన్టీఆర్ జిల్లా జట్టుపై 5–4, విశాఖపట్నం జట్టు, విజయనగరం జట్టుపై 4–0 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. ఆదివారం ఉదయం జరిగే మొదటి సెమీఫైనల్స్‌లో విశాఖపట్నం, సత్యసాయి జిల్లాల జట్లు తలపడనున్నాయి. రెండో సెమీ ఫైనల్స్‌లో ఏలూరు, కాకినాడ జట్లు పోటీపడనున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లు మధ్యాహ్నం జరిగే ఫైనల్స్‌లో తలపడనున్నాయి. అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. కోశాధికారి ఉమాశంకర్, వివిధ జిల్లాల అసోసియేషన్‌ల ప్రతినిధులు, అంపైర్లు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక


పార్టీలో చేరిన వారితో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం మండలం వవ్వేరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తోనేటి శేఖరయ్య, భట్ట దాసుతో పాటు మరో 50 మంది ఆ పార్టీని వీడారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగిన వారు వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలోనే 90 శాతం మంది వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నారన్నారు. కొత్త, పాత వారందరూ సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ లలితమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, టుంగుటూరు మల్లికార్జునరెడ్డి, మోర్ల మురళి, శ్రావణ్ పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.8,34,464

వలేటివారిపాలెం: మాలకొండలో కొలువైన శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం రూ.8,34,464 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కుంకుమార్చన ద్వారా రూ.20,200, తలనీలాల ద్వారా రూ.39,375, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,80,200, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,99,235, అన్నదానం విరాళాల ద్వారా రూ.3,37,288, రూంఅద్దెల ద్వారా రూ.25,200 ఆదాయం వచ్చిందని వివరించారు. వాటితో పాటు వివిధ విరాళాలు కలిపి రూ.8,34,464 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ప్రివిలేజ్ కమిటీ మెంబర్‌గా తూమాటి


ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ మెంబర్‌గా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నియమితులయ్యారు. ఈ మేరకు శాసనమండలి చైర్మన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యుల హక్కుల కోసం, శాసన మండలి నిబంధనలు కాపాడేందుకు కృషి చేస్తానని తూమాటి చెప్పారు. తనను ప్రివిలేజ్ కమిటీ మెంబర్‌గా నియమించడంపై మండలి చైర్మన్ మోషేన్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గుడ్లూరు: భర్త మరణంతో మానసికంగా కుంగిపోయిన ఓ వృద్ధురాలు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని చెమిడిదపాడులో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. చిత్తారు యానాదమ్మ (60) భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. అప్పట్నుంచి మానసికంగా కుంగిపోయి గ్రామంలోని పెద్దకూతురు వద్ద ఉంటోంది. మతిస్థిమితం కోల్పోయి ఇటీవల రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు సకాలంలో వైద్యశాలకు తీసుకెళ్లి కాపాడుకున్నారు. శనివారం ఉదయం కూతురు, అల్లుడు పొలం వెళ్లగానే ఇంట్లో మామిడి చెట్లకు కొట్టే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కూతురు, అల్లుడు గమనించి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో యానాదమ్మ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నెల్లూరు నగరపాలక సంస్థ


ఆర్.ఓ.సి.నెం. 1280/HFA/2018 తేది:23.09.2023

పత్రికా ప్రకటన

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకము క్రింద అర్హులైన లబ్ధిదారులకు కేటాయించబడిన 365 Sft., 430 Sft. ల గృహములను తీసుకొనుటకు గాను అయిష్టత చూపువారు, బ్యాంకు లోను తిరస్కరింపబడిన, వయసు పైబడి సంబంధిత వారసులు లేని వారు లేదా సిబిల్ స్కోరు తక్కువగా ఉన్న వారు, చనిపోయిన కుటుంబ సభ్యులకు సంబంధించి పూర్తి ధృవీకరణ పత్రములను కార్యాలయమునకు అందచేయని వారు, ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు వలస వెళ్లినవారికి 15 రోజుల లోపల నోటీసును జారీచేసి వారి గడువు అయిన 15 రోజుల పూర్తి అయినందున వారి నుండి ఎటువంటి స్పందన లేని కారణమున నోటీసులను జారీ చేయబడిన లబ్ధిదారుల జాబితాను అన్ని వార్డు సచివాలయముల యందు, నగరపాలక సంస్థ కార్యాలయము నందు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము నోటీసు బోర్డు నందు అంటించడం జరిగినది. దాని పై అభ్యంతరం గల లబ్ధిదారులు సదరు సచివాలయము నందు గాని లేదా నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయము హౌసింగ్ ఫర్ ఆల్ విభాగము నందు గాని తమ అభిప్రాయములను తెలియజేయవలసినదిగా కోరడమైనది. అలా ఈ దినము నుండి అనగా తే.25.09.2023ది నుండి తే.01.10.2023ది వరకు 7 దినముల లోపల నోటీసు బోర్డులో ప్రదర్శింపబడిన లబ్ధిదారులు నుండి ఎటువంటి స్పందన లేని యెడల వారికి ఇల్లు తీసుకొనుటలో ఇష్టత లేదని సదరు గృహములను రద్దుపరచబడునని తెలియజేయడమైనది.

ఇట్లు,
సం/- వికాస్ మర్మత్, I.A.S.,
కమీషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 128
లేయర్ (లైవ్) : 115
బ్రాయిలర్ చికెన్ : 222
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 248
లేయర్ చికెన్ : 195

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి : రూ. 70
సన్నవి : రూ. 40
పండ్లు : రూ. 10

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

దుత్తలూరు: సూపర్‌వాస్మోల్ తాగి ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు ఆస్పత్రికి తరలించి కాపాడారు. ఈ ఘటన మండలంలోని నర్రవాడ సమీపంలోని పొలాల్లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం వేంపాడు పంచాయతీ వెంగమాంబపురానికి చెందిన మానం వెంకటేశ్వర్లు, మరో యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఐదురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు వరికుంటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం ప్రేమజంట సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నామని సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పగా, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు దుత్తలూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ప్రేమజంట ఉన్న ప్రదేశానికి తన సిబ్బందితో చేరుకున్నారు. వెంకటేశ్వర్లు సూపర్ వాస్మోల్ సేవిస్తుండగా సీసాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు.